క్లుప్తంగా

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

గోకవరం: దసరా పండగను పురస్కరించుకుని గోకవరం ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ యు.రామన్నదొర తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోకవరం డిపో నుంచి విజయవాడ, శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు దసరా సెలవుల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

శంఖవరం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కత్తిపూడి సీతారామా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడి సీతారామా డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఫేర్‌వెల్ డే, ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అక్కారావు, వెంకటేశ్వరరావు, బాబులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ


ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సలాది కృష్ణ

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ అవార్డు గ్రహీత సలాది కృష్ణ అన్నారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సంస్థ సభ్యులు గొందేసి సత్యానందం, భేరి రాంబాబు, శిరసాల మణికంఠ జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

అన్నదానం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం అన్నదానం నిర్వహించారు. దాతలు చెల్లూరి రాంబాబు, తేలు కనకరాజు కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలిపారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న హైషర్ వ్యాన్ ముందు భాగం

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు వద్ద శనివారం తెల్లవారుజామున టిప్పర్‌ను హైషర్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే..కర్ణాటక నుంచి కోల్‌కతా వెళుతున్న హైషర్ వ్యాన్ మండలంలోని తాళ్లూరు శివారు హనీ దాబా వద్దకు వచ్చే సరికి ముందు వెళుతున్న టిప్పర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. సంఘటన స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది కుమార్, సతీష్ హైవే సిబ్బంది సహకారంతో వ్యాన్‌ను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

నాయకుల సంతాపం


కాశీ విశ్వనాథం (ఫైల్)

గండేపల్లి: మండలంలోని కె.నాయకంపల్లి గ్రామ సర్పంచ్ మలిరెడ్డి మహాలక్ష్మి వరహాలు భర్త కాశీ విశ్వనాథం (56) శనివారం మృతి చెందారు. కాశీ విశ్వనాథం ఈ నెల 9న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు అతడిని కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. మృతుని కుమారుడు ప్రణీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు బాదం ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

ప్రజాప్రతినిధుల సంతాపం

కాశీ విశ్వనాథం మృతదేహాన్ని గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరు మధు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సానుభూతి వ్యక్తం చేశారు.

కృష్ణవరంలో 'వారధి'

కిర్లంపూడి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. మండలంలోని కృష్ణవరంలో శనివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలు రాగద్వేషాలకు పోకుండా స్నేహ భావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో నిషేధిత గంజాయి, సారా, మాదకద్రవ్యాల విక్రయాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందాల హరిఇల్లు

గండేపల్లి మండలంలో వివరాలు		
మంజూరైన స్థలాలు	:	2382
గృహ రుణాల లబ్ధిదారులు	:	711
పునాది దశలో ఉన్న ఇళ్లు	:	133
గోడలు పూర్తయినవి	:	17
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	:	246
ఇంకా ప్రారంభించనవి	:	315


మురారి జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు


తాళ్లూరు జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణం
- నెరవేరుతున్న పేదల సొంతింటి కల
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

గండేపల్లి: మాకు నీడనిచ్చి..మా బతుకుల్లో ఆనందాన్ని నింపింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని లబ్ధిదారులు మురిసిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నేరవేరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నవరత్నాలు–అర్హులందరికీ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రంలోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో జగనన్న కాలనీలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి.

మండలంలో 2382 మందికి...

గండేపల్లి మండలంలోని 19 లే అవుట్లలో 2382 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఈ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ప్రస్తుతం తాళ్లూరు, మురారి, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, యల్లమిల్లి, యర్రంపాలెం, సూరంపాలెం, సుబ్బయమ్మపేట తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు రాయితీపై సిమెంట్, ఇసుక, ఐరన్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. ఇంటి పునాదులు పూర్తయితే రూ.70,000, గోడలు నిర్మిస్తే రూ.37,600, శ్లాబ్ వేసుకుంటే రూ.21,200, ప్లాస్టింగ్ పూర్తయితే మరో రూ.21,200 నగదుతో పాటు బాత్ రూమ్‌లకు రూ.12000, అదనంగా ఎన్ఆర్‌జీఎస్ ద్వారా రూ.18000 అందిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.35000 వేలు అదనంగా బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తున్నారు.

జగనన్న కాలనీల్లో వసతులు

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇళ్ల నిర్మాణం జరుగుతున్న కాలనీల్లో మెరక పనులతో పాటు తాగునీరు, విద్యుత్, సరఫరా తదితర మౌళిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనుల్లో బిజీగా ఉన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు ఇప్పటికే గృహ ప్రవేశం చేశారు.

కల నెరవేరింది



మాది చిన్న కుటుంబం. మా అమ్మ, పిల్లలతో గత 15 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. చాలా ఇబ్బందులు పడ్డాం. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా మా సొంతింటి కల నేరవేరలేదు. జగనన్న వచ్చాక మాకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇన్నాళ్లకు మా సొంతింటి కల నెరవేరింది.

– వేల్పూరి రత్నకుమారి, లబ్ధిదారు, తాళ్లూరు

అద్దె ఇంట్లో అవస్థలు పడ్డాం



సుమారు పది సంవత్సరాల పాటు అద్దె ఇంట్లోనే అవస్థలు పడ్డాం. సొంత ఇల్లు ఎప్పుడు నిర్మించుకుంటామా ? అని కలలు కనే వాళ్లం. జగనన్న ప్రభుత్వంలో మా సొంతింటి కల నేరవేరింది. మాకు ఇళ్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల రుణం ఇచ్చారు. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– తెల్లమేకల వీరవేణి, లబ్ధిదారు, మురారి

కష్టాలు తీరాయి



జగనన్న వచ్చాక మా ఇబ్బందులు తొలగాయి. నా భర్త, పిల్లలు, మా అత్త, మామ అందరం కలిసి ఒకే ఇంట్లో ఉండేవాళ్లం. ఇల్లు సరిపోక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న దయతో మా కష్టాలు తీరాయి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది.

– దారా బేబీ, మురారి

ఆనందంగా ఉంది



ఒకే ఇంట్లో నా కుటుంబంతో పాటు అమ్మనాన్న కలిసి ఉండేవాళ్లం. ఇల్లు సరిపోక అవస్థలు పడేవాళ్లం. జగనన్న ఇచ్చిన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం సొంతింట్లో జీవించడం ఆనందంగా ఉంది.

– జక్కిలింక రామకృష్ణ, లబ్ధిదారు

17.5 కేజీల గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఈబీ పోలీసులు

తుని: అక్రమంగా తరలిస్తున్న 17.5 కేజీల గంజాయిని పట్టుకున్నట్టు కాకినాడ ఎస్ఈబీ సీఐ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని కాకినాడ ఎస్ఈబీ ఏఎస్పీ జి.ప్రేమ్‌కాజిల్‌కు అందిన ముందస్తు సమాచారం మేరకు సీఐ వెంకటేశ్వరరావు, కోటనందూరు తహసీల్దార్ కుశరాజు, వీఆర్వో సూర్యనారాయణతో కలిసి కోటనందూరు మండలం టీజే నగరం వద్ద కాపు కాశారు. విశాఖ మన్యం నుంచి హోండా షైన్ బైక్‌పై తరలిస్తున్న 17.5 కేజీల గంజాయి, 10 ఎంఎల్ లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా నకిరికల్ మండలం చేజర్ల గ్రామానికి చెందిన బానావతు బాలనాయక్, బానావతు రవినాయక్‌లను అరెస్టు చేశారు. పట్టుకున్న గంజాయి మార్కెట్ విలువ రూ.1.2 లక్షలు, బైక్ విలువ రూ.30 వేలు, లిక్విడ్ గంజాయి విలువ రూ.1,500 ఉంటుందని ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఎస్సై విజయ్ కుమార్, హెచ్‌సీ ప్రసాద్, సిబ్బంది గంగాధరరావు, నవీన్, రమణ, వినయ్ పాల్గొన్నారు.

విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

తుని: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన విశ్వరూప మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ మాదిగ కోరారు. శనివారం తుని పట్టణం కొండవారిపేటలో విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. వచ్చే నెల 7న హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప సభకు అలంపూర్ నుంచి చేపట్టే పాదయాత్రకు మాదిగలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కింతాడ సత్తిబాబు, ఆరుగుల సతీష్, పెదపూడి శివ, మామిడి రాజా, మురళీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక


సత్యవీరదుర్గబాబు

గోకవరం: మండలంలోని కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి దారపు సత్యవీరదుర్గబాబు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం ఈశ్వరీదేవి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో సత్యవీరదుర్గబాబు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. విద్యార్థి దుర్గబాబును హెచ్ఎంతో పాటు పాఠశాల చైర్మన్ కోటిన లోవకుమార్, సర్పంచ్ అడపా వెంకట్రావు, కొత్తపల్లి సర్పంచ్ కాటమస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్టీల సొమ్ము ఎగ్గొట్టిన మహిళపై కేసు

తుని: చిట్టీల పేరుతో వ్యాపారులు, ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేసి ఎగ్గొట్టిన మహిళపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బి.చిన్నారావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తుని మండలం రేఖవానిపాలేనికి చెందిన సుంకర లక్ష్మి చిట్టీలు నడుపుతోంది. అదే మండలానికి చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు గంట్ల సత్యనారాయణ రూ.లక్ష విలువ చేసే రెండు చిట్టీలను సుంకర లక్ష్మి దగ్గర వేశారు. గడువు ముగిసినా చిట్టీల సొమ్ము ఇవ్వలేదు. ఇటీవల సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు పలు సార్లు చిట్టీల సొమ్ము ఇవ్వాలని ఆమెను అడిగారు. తమ గుమస్తాను రేఖవానిపాలెంలోని లక్ష్మి ఇంటికి పంపారు. ఆమె అక్కడ లేక పోవడంతో గుమస్తా తిరిగి వచ్చి విషయాన్ని తెలిపారు. సమచారం తెలుసుకున్న సుంకర లక్ష్మి తుని పట్టణంలో ఉన్న సత్యనారాయణ షాపుకు వెళ్లి గొడవ చేయడంతో సత్యనారాయణ కుటుంబ సభ్యుడు చిట్టిబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చిన్నారావు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా కె.సునీత ఎంపికయ్యారు. స్థానిక అంబేడ్కర్ పార్కు ఆవరణలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ సమావేశం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా అల్లాడి లక్ష్మి, కోశాధికారిగా కె.హేమలత, ఉపాధ్యక్షులుగా కె. అచ్చిరాజు, పి.నూకరత్నం, ఎస్.అమలావతి, సహాయ కార్యదర్శులుగా టి.నాగసత్యవతి, టి. రాణి, యు.ఉమాశంకరి, మరో 20 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఇ.చంద్రావతి, సీఐటీయూ మండల నాయకుడు రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న అనూష యాదవ్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఈపి గంగా రాంప్రసాద్ (9) గుండె సంబంధిత వ్యాధి బాధపడుతున్నాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ బాలుడిని తిరుపతి పద్మావతి ఆసుపత్రికి రిఫర్ చేశారు. తిరుపతికి అంబులెన్స్‌లో తీసుకువెళ్లలేని ఆర్థిక పరిస్థితి బాలుడి కుటుంబానిది. విషయం తెలుసుకున్న బీసీ వై పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి అనూష యాదవ్ అంబులెన్స్ ఖర్చుల నిమిత్తం బాలుడి తల్లిదండ్రులకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శనివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, దత్తాత్రేయ శర్మ, కోట వంశీ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ హోమం నిర్వహించారు.

దసరా వచ్చిందయ్యో...


ఏలేశ్వరంలోని దిబ్బలపాలెంలో ఏర్పాటు చేసిన ముఖద్వారం


లింగవరంకాలనీలో ముస్తాబైన అమ్మవారి ఆలయం


తపోవనంలో రాజరాజేశ్వరి అమ్మవారికి మహాభిషేకం చేస్తున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి

- నేటి నుంచి శరన్నవరాత్ర వేడుకలు
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు

ఏలేశ్వరం: గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. శరన్నవరాత్ర వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 24 వరకూ నిర్వహించనున్నారు. దుర్గమ్మ ఆలయాల వద్ద విద్యుత్ దీపాలతో పాటు రకరకాల రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని లింగంవరం కాలనీ, తోట వీధి, ఆర్టీసీ బస్టాండ్, నర్సీపట్నం రోడ్, దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయాల వద్ద భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద అమ్మవారి భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కుంకుమపూజలతో పాటు రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి ఆలయం

పట్టణంలో జేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏటా లింగవరంకాలనీలోని ప్రధాన రహదారి సమీపంలో జేవీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసే అమ్మవారి విగ్రహం ప్రత్యేకతను సంతరించుకోనుంది. ఏటా ఇక్కడ భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి మహాభిషేకం

తుని రూరల్: శరన్నవరాత్రుల్లో నిష్ఠతో దుర్గమ్మను పూజిస్తే సకల శ్రేయస్సు కలుగుతుందని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి అన్నారు. దసరా ఉత్సవాలు ప్రారంభమైన సందర్భంగా శనివారం తపోవనం ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి మాట్లాడుతూ దేవీనవరాత్రుల్లో ఆలయాల్లోనే కాకుండా ఇళ్లల్లోనూ అఖండ దీపారాధన, అమ్మవారి పూజించడం శుభకరమన్నారు. ఆశ్రమంలో ప్రతిరోజూ శ్రీచక్రార్చన, వేదపారాయణ, చండీ సప్తశతీ పారాయణ, దేవీభాగవత పారాయణ, శ్రీలక్ష్మీనారాయణ హృదయ పారాయణ, రాజరాజేశ్వరీ అమ్మవారికి త్రికాల పూజ, గోపూజ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 18న గణపతి హోమం, 19న శ్రీలలితా హోమం, విషు పుణ్యకాల పూజ, 20న సరస్వత్యావాహనం, 22న దుర్గాష్టమి, 23న మహానవమి, చండీయాగ పూర్ణాహుతి, శమీపూజ, 24న విజయదశమి, శ్రీరామ పట్టాభిషేక పారాయణ, 28న శ్రీలక్ష్మీనారాయణ హోమం నిర్వహించనున్నట్టు సరస్వతీ మహాస్వామి వివరించారు.

కోటనందూరు: మండల వ్యాప్తంగా ఆదివారం నుంచి దసరా వేడుకలు ప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో ఇప్పటికే అమ్మవారిని నిలిపేందుకు మండపాలు ఏర్పాటు చేసి అరటి, మామిడి ఆకులు, విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మండపాల వద్ద డీజే సౌండ్స్ ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రం కోటనందూరుకు వచ్చి అమ్మవారి ప్రతిమలు, పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

కిర్లంపూడి: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని జగపతినగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడి వాసవీ కన్యకాపరమేశ్వరి, వనదుర్గాదేవి, చిల్లంగి, రామచంద్రపురం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. పలు ఆలయాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. జగపతినగరం అభయ దుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని మామిడాకులు, పూలదండలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి కటౌట్


కోటనందూరులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన కనకదుర్గమ్మ ప్రతిమలు


జగపతినగరం అభయ దుర్గమ్మ ఆలయం వద్ద విద్యుత్ కాంతులు

రత్నగిరిపై శరన్నవరాత్ర సంబరాలు


దసరా ఉత్సవాలకు ముస్తాబైన వనదుర్గ అమ్మవారి ఆలయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం నుంచి ఈ నెల 23 వరకూ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుని ఆలయంలో పండితులు కలశస్థాపన చేసి దసరా వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుంకుమపూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు, 16 మంది అర్చకులకు అధికారులు దీక్షా వస్త్రాలు అందజేస్తారని అధికారులు తెలిపారు.

తొలిరోజు బాలాత్రిపురసుందరి అలంకరణ

దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను బాలాత్రిపురసుందరి అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు.

దర్బారు మండపంలో..

వనదుర్గ, కనకదుర్గ ఆలయాలతో పాటు దర్బారు మండపంలో అనంతలక్ష్మీసత్యవతీ అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణ, పూజలు చేయాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ అధికారులను ఆదేశించారు.

అలంకరణలు ఇలా...

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 15న బాలాత్రిపుర సుందరి, 16న కల్యాణ గౌరీదేవి, 17న అన్నపూర్ణ దేవి, 18న గాయత్రీ దేవి, 19న మహాలక్ష్మీ దేవి, 20న సరస్వతీ దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్ధిని, 23న రాజరాజేశ్వరీదేవిగా అమ్మవార్లను అలంకరించి పూజిస్తారు.

23న శమీపూజ

విజయదశమి సందర్భంగా ఈ నెల 23న రత్నగిరిపై చండీహోమం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం శమీ పూజ నిర్వహిస్తారు. అనంతరం వెండి, గజ వాహనంపై సత్యదేవుడు, అమ్మవారిని కొండ దిగువన ఊరేగిస్తారు. కళాశాల మైదానంలో 108 మంది చిన్నారులు శ్రీరాముని వేషధారణలో రావణ సంహారం చేస్తారని అధికారులు తెలిపారు.